## చిన్నకథ

# కన్నీళ్ళు

–జయసూర్య

సుబ్బారావు, నేనూ చిన్ననాటి స్నేహితులం. మా ఊళ్ళో ఒకే స్కూలులో చదువుకొన్నాం. సుబ్బారావు తండ్రి అకస్మాత్తుగా మరణించడంతో, చదువుకు స్వస్తి చెప్పి మా ఊళ్లో వున్న రైస్‌మిల్లు గుమస్తాగా స్థిరపడవలసి వచ్చింది. టూరింగ్ టాకీస్ పనులు కూడా తానే చూసేవాడు. కాలేజీ సెలవు రోజులలో తరచు మేం కలుసుకొని కష్టసుఖాలు మాట్లాడుకొనే వాళ్లం. నేను ఎం.ఎస్.సి. జువాలజీ కావటంతో వెటర్నరీ డాక్టర్‌గా ఉద్యోగంలో చేరాను. చాలా సంవత్సరాలు అక్కడక్కడ పని చేసి, మా ఊళ్లో ప్రమోషన్‌పై అసిస్టెంట్ డైరక్టరుగా బదిలీఅయి వచ్చాను. చిన్నప్పటి మా ఊరు, పట్టణంగా ఎదిగినా సుబ్బారావు కుటుంబం ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే వుంది. వృద్ధురాలైన తల్లి, పెళ్లికి ఎదిగిన చెల్లెళ్ళు, చదువు సంధ్యా లేకపోగా త్రాగుడుకు అలవాటుపడిన తమ్ముడు పేదరికంతో ఆ కుటుంబం సతమతమవుతోంది. నేను సహాయం అందించినా అంతంత మాత్రంగా, పేదరికం అజ్ఞానం ఆ కుటుంబాన్ని పీడించడంతో సమస్యలు పరిష్కారమయ్యేవి కాదు. తమ్ముని దారిలో పెట్టాలని, చెల్లెళ్ళకు బతుకు తెరువు చూపించాలని సాధ్యమైనంతగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే తపనతో ప్రయత్నాలు ప్రారంభించాను. రోజూ సాయంత్రం ఆసుపత్రి డ్యూటీ అయిన తరువాత సుబ్బారావుతో ఆలోచించేవాన్ని. ఆ ప్రయత్నంలో భాగంగా మరొక చిన్ననాటి మిత్రుడు, పరాత్పరరావును ఒక రోజు కలుసుకోవలసి వచ్చింది.



మా ఊళ్ళో పరాత్పరరావును తెలియని వారు తక్కువ. అప్పుడప్పుడు అవసరాల కనుగుణంగా రాజకీయ పార్టీలతో సన్నిహితంగా వుంటూ కమ్యూనిస్టు భావజాలాన్ని ఆరాధించే రాజకీయ ప్రముఖునిగా గుర్తింపు తెచ్చుకొన్నాడు. అమెరికా పెట్టుబడిదారీ విధానాలను విమర్శించటం, ప్రపంచీకరణ సృష్టించే దుష్ఫలితాలను దుయ్యబట్టడంతో పరాత్పరరావును మా ఊళ్ళో శ్రామిక వర్గాలు తమకు అర్థం కాని రాజకీయం తెలిసిన మేధావిగా భావించి గౌరవిస్తున్నారు. అన్నింటికంటే పరాత్పరరావు వడ్డీకి అప్పు యిచ్చి డబ్బు తిప్పుతుండటం సామాన్య జనానికి ఆసరా అయింది. నిర్మొహమాటంగా వడ్డీ వసూలు చేసేవాడు. రోజూ కష్టించి కూలి సంపాదనపై రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబాల మహిళలు, రోజువారీ తోపుడు బళ్ళ వ్యాపారులు, తాగుడు వంటి వ్యసనాల బానిసలు తమ అవసరాల కోసం పరాత్పరరావు కాళ్ళా వేళ్ళా పడేవారు. ఇళ్ళ స్థలాల పట్టాలు, రేషనుకార్డులు కూడా తాకట్టుగా తీసుకొనేవాడు. అతని మాటలకు చేతలకు అసలు పొంతన వుండేది కాదు. పేదల కష్టాలకు కరిగి నీరయ్యే జాలిగుండె వున్న రాజకీయవేత్తలా మాట్లాడే వాడు. నిస్సహాయుల బాధలకు, వేదనకు చలించని, పట్టించుకోని పరాత్పరరావు వలలో సుబ్బారావు లాంటి చిన్నచేపలు బలి అయ్యేవి. సుబ్బారావు కుటుంభం వుంటున్న పాడుపడిన పాత కొంపపై అతని దృష్టి పడింది. ఆ కుటుంబానికి అవసరాలకు అడపా తడపా యిచ్చి ఇల్లు రాయించుకొన్నాడు. తాకట్టు నుంచి సుబ్బారావు ఇంటిని విడిపించటానికి నేను భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది.

వెటర్నరీ డాక్టర్‌గా పాడి పశువుల కన్నీళ్ళు నాకు రోజూ అలవాటే. అది శారీరక వేదన వల్ల. విచిత్రమేమిటంటే మొసలిలాంటి కొన్ని జంతువులు ఆహారం తినేటప్పుడు రోజూ కన్నీళ్ళు కారుస్తుండటం వాటి శారీరక ప్రక్రియ. మనస్సు కదిలి చలించి వచ్చే కన్నీళ్ళు కావవి. ఇతరుల బాధలు, వేదనను కేవలం మాట్లాడి పబ్బం గడుపుకోవటమే 'మొసలి కన్నీరు'. అది ఓట్లు దండుకోవ టానికి రాజకీయ నాయకులు అన్యాయ అక్రమ సంపాదనకు కొందరు పెద్దలు నిత్యం చేస్తుంటారు. 'క్రైయింగ్ విత్ ఈటింగ్' మొసలి ప్రకృతి ధర్మం. అయితే 'క్రైయింగ్ ఫర్ ఎర్నెంగ్' మనం చచ్చేవరకు ఏడ్చే ఏడుపు.

*